రోడ్డు వచ్చింది.. వెతలు తీర్చింది

- రైల్వే స్టేషన్ రోడ్డు పనులు పూర్తి
- 40 గ్రామాల వారికి ఉపయోగం


రైల్వే స్టేషన్ రోడ్డులో రూ 1.40 కోట్లుతో చేపట్టిన రోడ్డు పనులు పూర్తయిన దృశ్యం

నరసాపురం: పట్టణంలో 30వవార్డులో రైల్వేస్టేషన్ రోడ్డులో రూ.1.40 కోట్లు 14వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన రోడ్డు పనులు పూర్తి కావచ్చాయి. రైల్వేస్టేషన్ రోడ్డులోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహం నుంచి గ్రేస్‌నగర్ వరకూ సగం సీసీ, సగం తారు రోడ్డు పనులకు గత ఏడాది డిసెంబర్ 26న రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనతి, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు కలిసి శంకుస్థాపన చేశారు. మున్సిపాలిటీ వెంటనే టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టింది. మూడు నెలల్లోనే రోడ్డు పనులు పూర్తికావచ్చాయి. దాదాపు 20 ఏళ్ల వరకూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధృడంగా రోడ్డు పనులు చేస్తున్నారు.

40 గ్రామాల వారికి ఉపయోగం..

చినమామిడిపల్లిలో రైల్వేగేట్ సమస్యల పరిష్కారానికి ఏడాది క్రితం రైల్వేస్టేషన్ పక్క నుంచి బైపాస్ రోడ్డు నిర్మించారు. దీంతో రైల్వేగేట్ సమస్య నుంచి జనానికి విముక్తి కలిగింది. భారీ వాహనాలు సైతం ప్రస్తుతం ఇదే రోడ్డు ద్వారా ప్రయాణిస్తున్నాయి. రైల్వే గేట్ సమస్యకు ప్రత్యామ్నాయంగా వేసిన బైపాస్ రోడ్డుకు అనుసంధానంగానే ప్రస్తుతం కొత్తగా నిర్మిస్తున్న రోడ్డు ఉంది. రోడ్డు ఇరుగ్గా ఉండటం, పాడైపోయి ఉండటంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. మత్స్యపురి మీదుగా నరసాపురం నుంచి జిల్లా కేంద్రం భీమవరం వెళ్లడానికికూడా ఇది ఒక ప్రధానం మార్గం. ఇంత ప్రాధాన్యం ఉన్న రహదారి దాదాపు 40 గ్రామాల వారికి ఉపయోగంగా ఉంటుంది. చకచకా రోడ్డు పనులు పూర్తవడంతో పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పనులు పూర్తయ్యాయి



రైల్వేస్టేషన్ రోడ్డులో రూ 1.40 కోట్లుతో చేపట్టిన రోడ్డు పనులు పూర్తయ్యాయి. కాంట్రాక్టర్ సకాంలో పనులు పూర్తి చేశారు. అలాగే పనులు నాణ్యతతో సాగేలా నిరంతరం మున్సిపల్ అధికారులు పర్యవేక్షణ చేశారు. పనులు జరుగతున్న దృష్ట్యా కొన్ని రోజులుగా మార్గంలో రాకపోకలు నిలుపుదల చేశాం. రెండు, మూడు రోజుల్లో మళ్లీ ఈ మార్గంలో యధాతథంగా రాకపోకలు పునరుద్ధరిస్తాం.

– బర్రి శ్రీవెంటకరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

నేడు లిఖితపూడిలో వైఎస్సార్ ఆసరా సభ

నరసాపురం రూరల్: మండలంలోని లిఖితపూడి గ్రామంలో సోమవారం మూడో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ దొంగ మురళీకృష్ణ ఆదివారం విలేకరులకు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహించే ఈ కార్యక్రమంలో మండలంలోని కొప్పర్రు, కే బేతపూడి, మల్లవరం, మల్లవరం లంక, లిఖితపూడి, సరిపల్లి, చిట్టవరం, గొంది, కొత్త, పాత నవరసపురం గ్రామాలకు చెందిన డ్వాక్రా సంఘాలకు ఆసరా పంపిణీ చేస్తారన్నారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ ఆదివారం విలేకరులకు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు విజ్ఞప్తులు తీసుకుంటామని పేర్కొన్నారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

కల్యాణ మహోత్సవం


కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

మొగల్తూరు: పేరుపాలెం కనకదుర్గా బీచ్‌లో ఉన్న దశావతార మత్స్యానారాయణస్వామి వారి కల్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి మాల విరమణ నిర్వహించారు. యాదగిరిగుట్టకు చెందిన బోదానందగిరి స్వామి అనుగ్రహభాషణాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో తిలకించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్న సమారాధన నిర్వహించారు.

ముత్యాలమ్మ సేవలో ఎంపీ మోపిదేవి

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మ అమ్మవారిని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు చైర్మన్ కొల్లాటి రామారావు, పాలకవర్గ సభ్యులు, ఈవో రామకృష్ణంరాజులు ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరక్టర్ బందన పూర్ణ చంద్రరావు, కొల్లాటి బాబూరావు, మాజీ సర్పంచ్ కొప్పాడిగుణ్ణయ్య, దొంగ కృష్ణ, పాలా రాంబాబు పాల్గొన్నారు.

తిరుమల వెంకన్న సేవలో నాయకులు


తిరుమలలో వెంకన్న సన్నిధిలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, చిత్రంలో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

పాలకొల్లు అర్బన్: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా విజయం సాధించిన జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ఆదివారం పెద్ద తిరుపతి వెళ్లి శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆయనతో పాటు ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కూడా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు శ్రీనివాస్, ప్రసాదరాజులను స్వామి వారి శేషవస్త్రాలతో సత్కరించారు.

ముగిసిన జాతర

నరసాపురం రూరల్: మండలంలోని చిట్టవరంలో ఉన్న శ్రీమారెమ్మ, పొల్లమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. గత ఐదు రోజుల నుంచి జాతరను పురస్కరించుకుని ఆలయం వద్ద వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. జాతర ముగింపు సందర్భంగా ఆదివారం భారీ అన్నసమారాధనను నిర్వహించారు. గ్రామానికి చెందిన పైడికొండల కృష్ణ, ఏసు కుటుంబీకుల ఆర్థిక సహకారంతో గత ఆరేళ్లుగా జాతరను పురస్కరించుకుని ప్రతీ ఏటా భారీ అన్నసమారాధనను నిర్వహిస్తున్నారు.

కొప్పర్రులో పుంతల ముసలమ్మ ఊరేగింపు

నరసాపురం రూరల్: మండలంలోని కొప్పర్రు గ్రామ దేవత పుంతల ముసలమ్మ అమ్మవారి ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం అమ్మవారికి తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించారు. ఉగాది పర్వదినం నుంచి ఐదు రోజులు జాతర జరిపి వైభవంగా ఉత్సవాన్ని నిర్వహించారు.

ఘనంగా పద్దాల వెంకమ్మ జాతర

పెనుగొండ: పద్దాల వెంకమ్మ జాతర మహోత్సవం ఆదివారం పెనుగొండ శాంతినగర్‌లో ఘనంగా నిర్వహించారు. శాంతినగర్ వాసులు ఉదయం నుంచి అమ్మవారికి పూజలు, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం గరగ నృత్యాలు, మేళతాళాలు, బాణాసంచా కాల్పులతో గ్రామోత్సవం నిర్వహించారు. పెనుమత్స విశ్వనాథరాజు, పూతినీడి శ్రీను, తమనంపూడి రాంబాబు, సబ్బీళ్ల దొరారెడ్డి, మిరియాల శ్రీకాంత్, గంటా సూర్యనారాయణ పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

యలమంచిలి: మండలంలోని గుంపర్రు గ్రామంలో కోడి పందాల శిబిరంపై ఆదివారం ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పందేలు వేస్తున్న 9 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,230 నగదు, మూడు పుంజులు, ఐదు కత్తులు, ఆరు సెల్‌ఫోన్లు, మూడు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

పేకాట, కోడిపందేల స్థావరాలపై దాడి

పాలకొల్లు అర్బన్: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం కోడి పందాలు, పేకాట స్థావరాలపై దాడి చేసి 13 మందిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై కె శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఉల్లంపర్రులో కోడి పందాలు ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి నుంచి ఒక కోడి పుంజు, రెండు కోడి కత్తులు, 9 సెల్ ఫోన్లు, మూడు మోటార్ సైకిళ్లు, రూ.23,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే లంకలకోడేరులో పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వీరి నుంచి రూ.1600 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

అగ్నాస్త్రం తయారీలో రైతులకు శిక్షణ


గుంపర్రులో అగ్నాస్త్రం తయారీలో రైతులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

యలమంచిలి: వరిచేలు, కాయగూరల తోటలను ఆశించి పంటలకు నష్టం కలగజేస్తున్న కాయ తొలుచు పురుగు, కాండం తొలుచు పురుగుల నివారణకు అగ్నాస్త్రం సమర్థంగా పని చేస్తుందని ప్రకృతి వ్యవసాయ విభాగం భీమవరం జోనల్ కోఆర్డినేటర్ చింతా వీరాస్వామి చెప్పారు. గుంపర్రులో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరి, కూరగాయలు సాగు చేస్తున్న రైతులకు ఆదివారం ఆయన అగ్నాస్త్రం తయారీ విధానాన్ని వివరించారు. 10 లీటర్ల గోమూత్రంలో 5 కిలోల వేపాకులు, అరకిలో పచ్చిమిర్చి, అరకిలో వెల్లుల్లి వేసి ఒక పాత్రలో నాలుగు పొంగులు వచ్చే వరకు మరగించాలన్నారు. కాచిన ద్రావణాన్ని 48 గంటలపాటు చల్లారనిచ్చి, అనంతరం పలుచటి గుడ్డలో ద్రావణాన్ని (అగ్నాస్త్రం) వడగట్టి ఒక డబ్బాలోనికి తీసుకోవాలన్నారు. ఈ ద్రావణం మూడు నెలల వరకు నిల్వ ఉంటుందన్నారు. కాయ తొలుచు పురుగు, కాండం తొలుచు పురుగు పంటలను ఆశించినపుడు ఈ అగ్నాస్త్రం మొక్కపై పిచికారీ చేయడం ద్వారా సమర్థంగా అరికట్టవచ్చునని వీరాస్వామి వివరించారు. కార్యక్రమంలో రైతులు జడ్డు గంగాధరరావు, జడ్డు బదరీనారాయణ, జడ్డు సత్యనారాయణ, జడ్డు ఆదినారాయణ, వి.యజ్ఞప్రసాద్, కె.రాజు, కె.ప్రసాద్, ఎ.రవీంద్ర, ఆర్.లీలా ఈశ్వరుడు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వంతో చదవాలి


యూటీఎఫ్ టాలెంట్‌టెస్ట్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ షేక్ సాబ్జి

పోడూరు: విద్యార్థులు పోటీతత్వంతో చదవాలని ఎమ్మెల్సీ షేక్ సాబ్జి పిలుపునిచ్చారు. యూటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5న 5, 10 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు కవిటం జెడ్పీ హైస్కూల్లో బహుమతులు అందజేశారు. బహుమతి ప్రధానోత్సవంలో ఎమ్మెల్సీ సాబ్జి ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు చదువు ఎంతో కీలకమన్నారు. తల్లిదండ్రులంతా తమ పిల్లలను ఉన్నతచదువులు చదివించాలన్నారు. జెడ్పీఫ్లోర్ లీడర్ గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి, దాసరి క్షేమమూర్తి, కేతా నాగరాజు, ఆచంట ఏఎంసీ చైర్‌పర్సన్ చిల్లే లావణ్య, వైస్‌చైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం, సర్పంచ్ చుట్టుగుల్ల పూర్ణిమ, ఎంపీటీసీ సభ్యుడు కుక్కల సూర్యనారాయణ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు పీఎస్ విజయరామరాజు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల పండుగ


బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని రెల్లిపేటలో కొలువై ఉన్న శ్రీ వడ్డిపోలమాంబ, కుంచమాంబ అమ్మవార్ల జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. రెల్లికుల సంక్షేమ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఈ నెల 12న ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో రోజుకో కార్యక్రమం చొప్పున అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం అమ్మవార్లకు బోనాలు పండుగ నిర్వహించారు. సుమారు 500 మంది పైగా మహిళలు అమ్మవార్లకు పాయసం నైవేద్యంగా తయారు చేసి బోనాలు నెత్తిన పెట్టుకుని తీన్మార్ వాయిద్యాలతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పట్టణ పొలిమేర అయిన నరసాపురం రోడ్డులో అయ్యప్పస్వామి ఆలయం వరకూ వెళ్లి ఉత్సవ ఊరేగింపును ముగించారు. ఏప్రిల్ 25 వరకూ జాతర ఉత్సవాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు ధనాల శ్రీనివాసు తెలిపారు.

పేదరోగికి ఆర్థిక సాయం

పాలకొల్లు అర్బన్: పేద వర్గాల విద్యా, వైద్య ప్రయోజనాలకు వాకర్స్‌క్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్ అన్నారు. దిగమర్రులో ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్న గోనిపాటి గాంధీ హృద్రోగంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని క్లబ్ సభ్యులు తెలుసుకుని రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని ఆదివారం సర్పంచ్ నగేష్ కరుణాకర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు, శ్రీ మన్యం జగ్గమ్మ గారి సత్రం చైర్మన్ నంబూరు శ్రీగంగా పవన్, క్లబ్ ప్రధాన కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్ పాల్గొన్నారు.

రేపు ఆశీల వేలం పాటలు

ఆకివీడు: నగర పంచాయతీ పరిధిలో 1.4.2023 నుంచి 31.3.2024వ తేదీ వరకూ గజిట్ నోటిఫికేషన్‌కు లోబడి ఆశీలు వసూలు చేసుకునేందుకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని రోజువారీ మార్కెట్ (కారు స్టాండ్‌తో కలిపి), వారపు సంత మార్కెట్, కబేళా పాట, రోజువారీ మార్కెట్ నందలి ఖాళీ ఉన్న షాపులు, పాత పేపర్లు వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు.వేలం పాటకు ముందుగా నిర్దేశిత సాల్వెన్నీ ధ్రువపత్రం, ఈసీ సమర్పించాలని సూచించారు.

సీఎం జగన్‌ను కలిసిన ప్రముఖులు


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో తాతాజీ

పాలకొల్లు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం గజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ కోరారు. దెందులూరు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ మేరకు వినతిపత్రం అందజేసినట్లు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపడంపై హర్షం వ్యక్తం చేశారు.

ఓబీసీలపై నిర్ణయం తీసుకోవాలి

పాలకొల్లు సెంట్రల్: తూర్పుకాపు సామాజిక వర్గం ఎదురుచూస్తున్న ఓబీసీ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కోరినట్లు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ ఆదివారం విలేకరులకు తెలిపారు. శనివారం ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గంలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రిని కలిసిన తాతాజీ ఓబీసీ సమస్య పరిష్కారం గురించి గురించి మాట్లాడినట్లు తెలిపారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం 2008లో బీసీ రిజర్వేషన్ కల్పించే విధంగా జీఓ ఇచ్చారని అన్నారు. అనంతరం 9 సంవత్సరాలు తరువాత చంద్రబాబు ప్రభుత్వం 2017లో ఆ జీవోను రద్దు చేశారన్నారు. తూర్పుకాపులకు ఒక్క ఉత్తరాంధ్రలోనే ఉన్న అవకాశం రాష్ట్రమంతా కల్పించాలని కోరానన్నారు.

ముగిసిన పెద్దింట్లమ్మ ఉత్సవాలు

పెనుగొండ: చెరుకువాడ శివారు మల్లప్పదిబ్బలోని పెద్దింట్లమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ నెల 22 నుంచి అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం అమ్మవారికి అర్చనలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం మహిళా భక్త సమాజం ఆధ్వర్యంలో లలితా పారాయణ, భజనా కాలక్షేపం నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గుడాల లక్ష్మీ, సాపే దమయంతి, రామోజు కనకదుర్గ, నల్లిమిల్లి నాగేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌పై అవగాహనా సదస్సు

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులకు పని అనుభవాన్ని ఇస్తూ కొంత స్టయిఫండ్ అందజేస్తూ పరిశ్రమలకు అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక కమ్యూనికేషన్స్ స్కిల్స్ అభివృద్ధి చేసుకుంటే ఉద్యోగ ఉపాదిఅవకాశాలు అందిపుచ్చుకోవచ్చని రిసోర్స్ పర్సన్ డాక్టర్ ఆర్.పార్థసారది తెలిపారు. ఆదివారం స్థానిక బీఆర్‌ఆర్ అండ్ జీకేఆర్ ఛాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో విద్యార్థులకు ఇంటెన్షిప్ ప్రోగ్రామ్‌పై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. కళాశాల చైర్మన్ కారుమూరి నరసింహరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, కలిదిండి రామరాజు పాల్గొన్నారు.

మానవత సంస్థ ఆధ్వర్యంలో సత్కారం

పెనుమంట్ర: మండలంలోని మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఆలమూరు గ్రామంలో జరిగిన మానవతా వార్షిక సమావేశంలో ఇద్దరు మానవతా వాదులు, మరో ఇద్దరు పీజీ ర్యాంకర్లను ఘనంగా సత్కరించారు. మానవతా సంస్థకు ఇతోధికంగా సహకరించిన మార్టేరుకు చెందిన వై.అచ్యుతరావు ప్రీజర్ బాక్సును అందజేసిన ఓడూరు గ్రామానికి చెందిన వద్దూరు చలమయ్య ఇటీవల నిట్ పీజీలో ఉత్తమ ర్యాంకులు సాధించిన ఆలమూరుకు చెందిన డాక్టర్ గుడిమెట్ల అనూషారెడ్డి, కొవ్వూరి సాయితేజస్వీ రెడ్డి అనే మెడికల్ విద్యార్థులను సంస్థ తరపున ఘనంగా సత్కరించారు.జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీసుభాషిణి, పెన్మెత్స విశ్వనాథరాజు, డాక్టర్ పీవీ సత్యనారాయణరాజు, సర్పంచ్ మేడపరెడ్డి వెంకటేశ్వరమ్మ, మానవతా అధ్యక్ష, కార్యదర్శులు చిర్ల శ్రీనివాసరెడ్డి, బాణాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యోగా ద్వారా మానసిక ప్రశాంతత

పెనుమంట్ర: యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఉచిత ధ్యాన శిక్షణ పిరమిడ్ మాస్టర్ బి నాగశ్రీ అన్నారు. ఆదివారం పెనుమంట్రలోని పిరమిడ్ ధ్యాన కేంద్రంలో నిర్వహించిన ఉచిత ధ్యాన శిక్షణా శిబిరంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. శారీరక బలం ఉన్నంతమాత్రన మనిషి ఆరోగ్యవంతుడు కాజాలడని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో హాజరైన వారికి ఆమె యోగా, శ్వాసమీద ధ్యాసపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీరవాసరం పిరమిడ్ ధ్యాన శిక్షణ కేంద్రం కన్వీనర్ కేవీడీ ప్రసాద్, పెనుమంట్ర కన్వీనర్ భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణ పనులు పరిశీలన


కనకాయలంకలో సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు

యలమంచిలి: జిల్లా పరిషత్ నిధులతో కనకాయలంలో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు పనులను ఆదివారం వైస్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో చేసే పనులకు ప్రజల పర్యవేక్షణ అవసరం అన్నారు. రోడ్డు పనుల ప్రగతి, నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వలవల ప్రసాద్, నాయకులు వలవల నరసింహమూర్తి, నాత్ర శ్రీను, పులి సుబ్రహ్మణ్యం, యన్నాబత్తుల సుధీర్ పాల్గొన్నారు.

జాతరలో కొట్లాట

యలమంచిలి: ఉగాది సందర్బంగా శనివారం రాత్రి దొడ్డిపట్లలో జరిగిన జాతరలో ఇరు వర్గాల మధ్య కొట్లాట జరిగింది. ఈ కొట్లాటలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఓదూరి భాస్కరరావుకు తలకు బలమైన గాయమైంది. దీంతో ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్ తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణానికి నిధుల మంజూరు


వెలగలేరులో శిథిలావస్థకు చేరుకున్న శ్రీపార్వతి రామలింగేశ్వరస్వామివారి ఆలయం

పెనుమంట్ర: మండలంలోని వెలగలేరు గ్రామానికి చెందిన శ్రీపార్వతి రామలింగేశ్వరస్వామి ఆలయ పునః నిర్మాణానికి దేవాదాయశాఖ రూ. 2 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు దేవస్థానం ఈఓ కె.జానకిరామరాజు తెలిపారు. లో లెవల్‌లో ఉన్న శిథిలావస్థకు చేరుకుంటున్న ఈ దేవాలయాన్ని పునర్నిర్మించేందుకు గ్రామస్తులు రూ.50 లక్షలు విరాళాలు సేకరించడంతో దేవాదాయశాఖకు కంట్రిబ్యూషన్ చెల్లించడంతో స్థానిక శాసన సభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు కృషితో దేవాదాయశాఖ రూ. 2 కోట్లు నిధులు మంజూరు చేసిందని ఆయన తెలిపారు. త్వరలో ఈ ఆలయాన్ని పునర్నిర్మించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు, సొసైటీ మాజీ అధ్యక్షుడు కొవ్వూరి పుత్రారెడ్డి తెలిపారు. ఈ ఆలయం పునర్నిర్మాణం వందేళ్ల క్రితం జరిగిందని, పరిసర ప్రాంతాల్లో రోడ్లు ఎత్తుకావడంతో ఆలయం లో లెవల్‌లో ఉంది. గ్రామస్తుల కోరిక మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఆయన తెలిపారు.

శ్రీ వీరభద్రస్వామివారిని తాకిన సూర్యకిరణాలు


జుత్తిగలో వీరభద్రస్వామివారిని తాకిన సూర్య కిరణాలు

పెనుమంట్ర: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం జుత్తిగ గ్రామంలో ఉన్న శ్రీఉమా వాసుకి రవి సోమేశ్వరస్వామి వారి ఆలయంలో పశ్చిమ అభిముఖంగా ఉన్న శ్రీభద్రకాళీ వీరభద్ర స్వామి వారి మూలవిరాట్‌ను ఆదివారం సాయంత్రం సూర్యకిరణాలు తాకాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీస్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. సూర్యాస్తమయ సమయంలో భక్తులు సుమారు 20 నిమిషాల పాటు సూర్యకిరణాలతో స్వామివారిని దర్శించుకున్నారు. వసంత నవరాత్రులు సందర్భంగా శ్రీదుర్గాదేవి అమ్మవారికి విశేష కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో ఎస్.వెంకటమల్లపరాజు, ఆలయ ఈఓ సాయి ప్రసాద్, సర్పంచ్ టి.వీర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న సీడీపీఓ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పాతూరు 12వ వార్డు సంజీవనగర్‌లో ఆదివారం రాత్రి ఓ ఇంటి వద్ద నిర్వహిస్తున్న బాల్యవివాహాన్ని సీడీపీఓ టి.లక్ష్మీసరస్వతి ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు సీహెచ్ దుర్గాభవాని, టి.వెంకటలక్ష్మి, డి.సుజాత, ఆర్.ఎస్తేర్ రాణి సంయుక్తంగా వెళ్లి అడ్డుకున్నారు. పాతూరుకు చెందిన 32 ఏళ్ల అబ్బాయికి, పడాల గరువుకు చెందిన 13 ఏళ్ల బాలికకు మైనార్టీ తీరకుండా వివాహం చేస్తున్నారు. చైల్డ్ లైన్ 1098 ద్వారా వచ్చిన సమాచారం మేరకు అధికారులు వెళ్లి ఈ వివాహాన్ని అడ్డుకున్నారు. ఇరుపక్షాల వారితో మాట్లాడారు. లిఖిత పూర్వకంగా వివాహాన్ని రద్దు చేసుకున్నట్లు అంగీకార పత్రాలు తీసుకున్నారు. ఐసీడీఎస్, రెవెన్యూ, అంగన్‌వాడీ, పోలీస్ సిబ్బంది, జీఎంఎస్‌కే తదితర సిబ్బంది హాజరయ్యారు. లక్ష్మీసరస్వతి మాట్లాడుతూ మైనార్టీ తీరకుండా వివాహం చేసుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనార్టీ తీరకుండా వివాహం చేస్తే కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మ అమ్మవారికి పట్టణానికి చెందిన మోటుపల్లి శ్రీనివాస్–రామలక్ష్మి దంపతులు 8 గ్రాముల బంగారాన్ని సమర్పించారు. వారికి ఆలయ అధికారులు రసీదు, అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్త ముత్యాల వెంకట రామరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో అందరికీ సమన్యాయం


పెదఅమిరం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న పీవీఎల్

కాళ్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి అందరివాడని అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఒకరేనని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. కాళ్ల మండలం పెద అమిరం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏలూరు జిల్లా దెందులూరులో ఈనెల 25న డ్వాక్రా మహిళల ఆసరా నిధులు విడుదల చేశారన్నారు. ఈ పథకంలో భాగంగా నియోజవర్గంలో డ్వాక్రా అక్క చెల్లెమ్మలతో సమావేశాలు ఏర్పాటు చేసేందుకు పార్టీ నాయకులు తీర్మానం చేశామన్నారు. దానికి అనుగుణంగా నాలుగు మండలాల్లో ఉన్న లబ్దిదారులతో కలిసి సమావేశాలు ఏర్పాటు చేయనున్నమన్నారు. ఈ నెల 31న ఉండి మండలంలో, ఏప్రిల్ 1 న పాలకోడేరు మండలం, 2న ఆకివీడు మండలం, 4న కాళ్ల మండలాల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బకాయిల భారంతో ఇబ్బంది పడుతున్న డ్వాక్రా మహిళలను ఆదుకుంటామని పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారికి అండగా ఉన్నారన్నారు. సమావేశంలో కాళ్ల ఆకివీడు జెడ్పీటీసీ సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, వేగేశ్న వెంకటరాజు, ఎంపీపీ భూపతి రాజు చంటి రాజు, పార్టీ నాయకులు పెనుమత్స విశ్వనాథరాజు, వేగేశ్న జయరామ కృష్ణంరాజు, కటారి కేశవ, గణేశ్న రాంబాబు, గుండుగోలు ధనరాజు, జగ్గరోతు విజయ్, నంద్యాల సీతారామయ్య, గుండా సుందర రామమూర్తి నాయుడు, హుస్సేన్, గోళ్ల సత్యనారాయణ, మోరా జ్యోతి రెడ్డి, తానంకి నాగరాజు పాల్గొన్నారు.